కౌలు రైతుకు వెన్ను దన్ను

- శరవేగంగా సాగుతున్న కౌలు కార్డుల జారీ
- ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం పొందే అవకాశం


పందలపాకలో కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు అందజేస్తున్న అధికారులు

బిక్కవోలు: కౌలు రైతుల కష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వారికి సులభతరంగా సీసీఆర్(క్రాప్ కల్టివేటర్ రైట్స్) కార్డును మంజూరు చేసి ఒక్కో కౌలు రైతుకు ఏడాదికి రైతుభరోసా పథకం ద్వారా రూ.13,500 అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఈ ఏడాది కూడా కౌలు రైతులకు రైతుభరోసా చెల్లించేందుకు సీసీఆర్(పంట సాగు హక్కు) కార్డుల మంజూరు ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 14,809 మంది కౌలు రైతులకు గాను 12,401 కౌలు కార్డులు అందించారు.

ప్రభుత్వ నిర్ణయంతో మారిన దశ, దిశ

గతంలో కౌలు రైతులకు కౌలు కార్డులు మంజూరు చేసినా పెద్దగా ప్రయోజనం ఉండేది కాదు. భూయాజమాని అనుమతిస్తే తప్ప కౌలు రైతులు ఎలాంటి రాయితీలు పొందలేకపోయేవారు. అలాగే తాము పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో నేరుగా విక్రయించుకోలేని పరిస్థితి ఉండేది. బ్యాంకు రుణాలైతే అందని ద్రాక్షగానే మిగిలేవి. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలు రైతుల కష్టాలను గుర్తించింది. భూయాజమాని హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా పంట సాగు చేస్తున్న కౌలు రైతుకు అన్ని రాయితీలు వర్తించేలా సీసీఆర్(పంటసాగు హక్కు) పత్రాలను అందజేస్తోంది. వీటితో వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే సకల రాయితీలు కౌలు రైతులు నేరుగా పొందడంతో పాటు బ్యాంకుల నుంచి ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం పొందే వెసులుబాటును కల్పించింది.

ఆదుకుంటున్న రైతు భరోసా

ఎక్కడా లేని విధంగా కౌలు రైతులకు రైతు భరోసా నగదు ఇచ్చే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులకు పీఎం కిసాన్ ద్వారా ఏడాది మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున రూ.6 వేలు అందిస్తే, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.7,500 కలిపి రైతు భరోసా కింద మొత్తం రూ.13,500 చెల్లిస్తోంది. కాని కౌలు రైతులకు కేంద్రం ఎలాంటి నగదు ఇవ్వదు. కౌలు రైతులను ఆదుకోవాలని సంకల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో కౌలు రైతుకు ఏడాదికి రూ.13,500 అందించేలా చర్యలు తీసుకున్నారు. గతేడాది 14,809 మంది కౌలు రైతు కార్డు తీసుకున్నారు. వారిలో ప్రతి ఒక్కరికీ రైతుభరోసా రూపేణా రూ.13,500 నగదును అందించారు.

నియోజకవర్గంలో కౌలు కార్డుల జారీ వివరాలు

మండలం	లక్ష్యం	పూర్తయినవి
అనపర్తి	3,671	2,983
బిక్కవోలు	4,027	3,623
రంగంపేట	3,671	3,232
పెదపూడి	3,440	2,563
మొత్తం	14,809	12,401

కౌలు రైతుల కష్టాలను గుర్తించింది



నేను 5 ఎకరాలు కౌలు చేస్తున్నాను. కౌలు రైతుల కష్టాలను గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలు రైతులను గుర్తించి ఆదుకుంటున్నారు. వ్యవసాయశాఖ ద్వారా సకల రాయితీలు అందేలా చూడడంతో పాటు రైతు భరోసా ఇచ్చి అండగా నిలుస్తున్నారు.

– పెనగంటి త్రిమూర్తులు, కౌలు రైతు, పందలపాక

కౌలు రైతుగా ఈ-కర్షక్‌లో నమోదు



కౌలు రైతులకు పక్కాగా సీసీఆర్ పత్రాలు ఇవ్వడంతో పాటు వారి సాగు వివరాలు ఫొటోతో సహా ఈ-కర్షక్‌లో నమోదు చేస్తున్నారు. దీనివల్ల కౌలు రైతులు భూయాజమానితో సంబంధం లేకుండానే రాయితీ పొందడంతో పాటు రైతు భరోసా, బ్యాంకు రుణాలు పొందే వెసులుబాటు కలిగింది.

– కొవ్వూరి మల్లికార్జున భాస్కర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, పందలపాక

అర్హులందరికీ కౌలు కార్డులు



అర్హత కలిగిన కౌలు రైతులందరికీ కౌలు కార్డులు అందజేస్తున్నాం. ఈ కార్డుల జారీ వల్ల భూయజమానికి ఇబ్బంది ఉండదు. కేవలం 11 నెలల కాలపరిమితితో కార్డు పనిచేస్తుంది. సాగుపై హక్కు తప్ప భూమిపై వారికి హక్కు ఉండదు. ఇంకా ఎవరైనా అర్హులుండి దరఖాస్తులు అందిస్తే వారికి కౌలు కార్డులిస్తాం.

– పోసిబాబు, తహసీల్దార్, బిక్కవోలు మండలం

జన హృదిలో జక్కంపూడి పదిలం

- మంత్రులు అంబటి, కొట్టు
- ఘనంగా రామ్మోహనరావు జయంతి


సీతానగరంలో జరిగిన జాబ్‌మేళాలో ఉద్యోగ నియామక పత్రాలను అందిస్తున్న మంత్రి సత్యనారాయణ, పక్కన ఎమ్మెల్యే రాజా

రాజానగరం: కష్టాలలో ఉన్న వారికి కొండంత అండగా నిలిచి, నేనున్నాననే భరోసా నందించిన దివంగత నేత, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు జనం హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని మంత్రులు అంబటి రాంబాబు, కొట్టు సత్యనారాయణ అన్నారు. విధేయత, విశ్వసనీయతలో జక్కంపూడికి వేరెవ్వరూ సాటిరారంటూ కితాబిచ్చారు. రామ్మోహనరావు 70వ జయంతి వేడుకలు నియోజకవర్గంలో వాడవాడలా ఆదివారం ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు, అభిమానుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలలో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో దివాన్‌చెరువు నుంచి శ్రీరామపురం, శ్రీకృష్ణపట్నం, భూపాలపట్నంల మీదుగా పుణ్యక్షేత్రం వరకు నిర్వహించిన భారీ మోటారు సైకిలు ర్యాలీలో మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. మార్గమధ్యలో శ్రీరామపురంలో బోయిడి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 110 మందికి చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు ఆధ్వర్యంలో శ్రీకృష్ణపట్నంలో దివంగత నేతలు వైఎస్సార్, జక్కంపూడి విగ్రహాలకు పూలమాలు వేసి, నివాళులర్పించారు. పుణ్యక్షేత్రంలో స్థానిక వైఎస్సార్ సీపీ కేడర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జక్కంపూడి రామ్మోహనరావు, వంగవీటి మోహనరంగా విగ్రహాలను మంత్రి ఆవిష్కరించారు. సీతానగరం మండలం, ఇనుగంటివారిపేటలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా సుమారు వేయిమంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. జీవకే కన్వెన్షన్ హాలులో నిర్వహించిన మెగా జాబ్ మేళాను మంత్రి సందర్శించారు. తొర్రేడు, ముక్కినాడ, రాజానగరం, కోరుకొండ, సీతానగరంలో పలుచోట్ల నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేసి పంచారు. జెడ్పీటీసీ సభ్యుడు వానంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, సెడ్ క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, ప్రచార కమిటీ అధ్యక్షుడు కుందేటి ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు, సర్పంచ్ మరుకుర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో..

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనావు జయంతి నిర్వహించారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూనివర్సిటీ ఏర్పాటుకు జక్కంపూడి చేసిన కృషిని వక్తలు కొనియాడారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

1,000 మందికి చీరల అందజేత

సీతానగరం: ఇనుగంటివారిపేటలో జక్కంపూడి రామ్మోహనరావు జయంతి సందర్భంగా సర్పంచ్ సత్యం రాంపండు ఆధ్వర్యంలో 1,000 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. తొలుత దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, కేక్ కట్ చేశారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ పేరిట ఆయన తనయుడు రాజా ఎన్నో కార్యక్రమాలు చేపడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ కార్యకర్తలే తమ కుటుంబానికి బలమని, నేడు ఈ స్థానంలో ఉండటానికి వారే కారణమని అన్నారు.

జాబ్‌మేళాలో 210 మందికి నియామక పత్రాలు

సీతానగరం జీవీకే కన్వెన్షన్ హాల్‌లో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్, వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 500 మంది నిరుద్యోగులు పాల్గొనగా, 210 మందికి ఉద్యోగ నియామక పత్రాలను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే రాజా చేతుల మీదుగా అందించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ పర్యవేక్షణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 40 మంది వైద్యులు 600 మందికి సేవలు అందించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ ఆరోగ్య రాజానగరం నియోజకవర్గం లక్ష్యంగా జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ పని చేస్తుందని తెలిపారు. మండలంలోని రాపాకలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపూరి రామరాజు ఆధ్వర్యంలో 60 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు ఆధ్వర్యంలో సీతానగరంలో కేక్ కట్ చేశారు. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ పిల్లి నిర్మల, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లమళ్ళ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముదునూరి సురేష్‌రాజు, సత్యం మదన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొండ్రపు ముత్యాలు, నియోజకవర్గం బూత్ కమిటీల చైర్మన్ గద్దె వెంకట కృష్ణ చౌదరి, ఎస్సీ సెల్ నాయకులు అంబటి రాజు, అంబటి రమణ, పార్టీ నాయకులు వలవల వెంకట్రాజు, ముదునూరి రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విజయలక్ష్మి


కోరుకొండ సాయిబాబా గుడి వద్ద మొక్కను నాటుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: జక్కంపూడి జయంతి వేడుకల్లో భాగంగా కోరుకొండలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మొక్కలు నాటారు. తొలుత పెట్రోలు బంకు సమీపంలోని సాయిబాబా దేవాలయంలోని బాబాను దర్శించుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రామ్మోహనరావు మంత్రిగా ఉన్నప్పుడు కడియం ప్రాంతంలో నర్సరీల విస్తృతికి కృషి చేశారన్నారు. మండలంలోని బూరుగుపూడి, తదితర ప్రాంతాల్లో విజయలక్ష్మి మొక్కలు నాటారు. మండలంలోని కోరుకొండ, తదితర గ్రామాల్లో జక్కంపూడి జయంతి వేడుకగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పూన, నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, తాడి ఆదిరెడ్డి, బొరుసు బద్రి, వాకా నరసింహారావు, నేతుల చిన్ని పాల్గొన్నారు.

వృత్తిలో సామర్థ్యాన్ని వృద్ధి చేసుకోవాలి

- ఎంపీ భరత్‌రామ్
- ముగిసిన ఫొటో ట్రేడ్ ఫెయిర్


ఫొటో ట్రేడ్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజానగరం: రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుంటూ, మార్పులకు అనుగుణంగా వృత్తిలో సామర్థ్యాన్ని వృద్ధి చేసుకోవాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. దివాన్‌చెరువులోని ఎస్‌వీసీసీ కన్వెన్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన గోదావరి ఫొటో ట్రేడ్ ఫెయిర్ – 2023 ఆదివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో పోటీతత్వం కంటే వనితనానికే ఎక్కువ విలువ, ప్రాధాన్యత ఉంటుందన్నారు. వివిధ జిల్లాల నుంచి హాజరైన ఫొటోగ్రాఫర్లను, స్టాల్స్ నిర్వాహకులను అసోసియేషన్ అధ్యక్షుడు కోని శ్రీను, గౌరవాధ్యక్షుడు అల్లు బాబి సత్కరించారు. ఫొటో ట్రేడ్ ఫెయిర్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రరావు, మాజీ కార్పొరేటర్లు సుబ్రహ్మణ్యం, బి.ప్రకాష్‌లు తిలకించారు. అసోసియేషన్ సలహాదారు కేతా శ్రీను, రావు అండ్ రావు, రాజమౌళి, వానపల్లి బాబి, ఎస్ఎస్ఎస్ శేఖర్, లాజర్, గోపి, యాపిల్ సూర్యకుమార్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న జక్కంపూడి గణేష్


గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న గణేష్

రాజమహేంద్రవరం సిటీ: ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలో రోడ్డు పక్కన పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఆసుపత్రికి తీసుకుని వెళ్లి వైద్య సేవలు అందించి వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ మానవత్వం చాటుకున్నారు. ఆదివారం జక్కంపూడి రామ్మోహనరావు జయంతి కార్యక్రమాలు నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. వాటిలో పాల్గొనేందుకు వెళుతున్న గణేష్ ఆర్యాపురం ఫైర్ స్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని గమనించారు. తక్షణమే వాహనం దిగి ఆ వ్యక్తిని తన వాహనం ఎక్కించుకుని దగ్గరలోగల సాయి ఎమర్జెన్సీ ఆసుపత్రిలో చేర్పించి తక్షణమే వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యులు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

అందంగా.. అర్బన్ స్క్వేర్‌గా

- సుబ్రహ్మణ్య మైదానంలో అధునిక వసతులు
- ఓపెన్ ఎయిర్ థియేటర్‌గా మార్పు
- రూ.6 కోట్లతో పనులు
- దసరా నాటికి నిర్మాణం పూర్తి


ఇలా అందంగా సిద్ధం కానున్న సుబ్రహ్మణ్య మైదానం (నమూనా చిత్రం)

రాజమహేంద్రవరం సిటీ: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వసతులు కల్పిస్తూ చారిత్రక బ్రహ్మణోస్యుల సుబ్రహ్మణ్య మైదానాన్ని అద్భుతమైన కట్టడంగా తయారు చేసేందుకు నగర పాలక సంస్థ సన్నాహాలు ప్రారంభించింది. చారిత్రక ఆనవాళ్లను ఏమాత్రం చెరిపివేయకుండా ఉన్న కట్టడాలను ఏమాత్రం చెక్కు చెదరకుండా భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండే విధంగా ఆధునిక సౌకర్యాలతో అర్బన్ స్క్వేర్‌గా తయారు చేస్తున్నారు. సుమారు రూ.6 కోట్ల వ్యయంతో తయారవుతున్న ఈ ఆధునిక నిర్మాణాన్ని దసరాకు ప్రారంభించే లక్ష్యంగా నిర్మాణం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న బ్రహ్మణోస్యుల సుబ్రహ్మణ్య మైదానాన్ని ఏమాత్రం ఇబ్బంది లేకుండా నిర్మాణం చేపట్టే విధంగా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. మైదానంలో ఓపెన్ ఎయిర్ థియేటర్, ప్రస్తుతం ఉన్న శ్రీ గరికపాటి రాజారావు స్మారక వేదికను యథాస్థానంలో ఉంచుతారు. ఆధునిక వసతులతో పూర్తి లైటింగ్‌తో మెయిన్ స్టేజ్, ప్రస్తుతం ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రం ఫ్రంట్ ఎలివేషన్, కళాకేంద్రం ప్రవేశానికి ఆధునిక వసతులతో ద్వారం, అత్యాధునిక లైటింగ్ వ్యవస్థ, వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేయనున్నారు.

నగరానికి శోభ

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం అవుతున్న అర్బన్ స్క్వేర్ ద్వారా నగరానికి మరింత శోభ తెచ్చేలా కృషి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మైదానాన్ని భవిష్యత్‌లో అందరికీ ఉపయోగపడేలా నిర్మాణం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. శ్రీ వేంకటేశ్వర ఆనంకళాకేంద్రం, శ్రీ బ్రహ్మణోస్యుల సుబ్రహ్మణ్య మైదానం అర్బన్ స్క్వేర్‌గా మార్పు చెందడం ద్వారా భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు జరుపుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.


సాగుతున్న నిర్మాణ పనులు

రెండు అవుట్ గేట్లు ఏర్పాటు చేస్తాం



భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా సిద్ధం అవుతున్న ఈ మైదానం నగరంలో అద్భుతమైన ప్రాంతంగా నిలుస్తుంది. సుబ్రహ్మణ్య మైదానానికి రెండు అవుట్ గేట్లు ఏర్పాటు చేస్తాం. నిర్మాణం శరవేగంగా జరుగుతోంది.

– పాండు రంగారావు ఎస్ఈ, నగర పాలక సంస్థ

కన్నమాంబ కరుణ అందరిపైనా ఉండాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగర వాసులకు అత్యంత ఇష్ట దైవమైన శ్రీ కన్నమాంబ కరుణ అందరిపైనా ఉండాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని స్టేడియం రోడ్డు వీటీ కళాశాల సెంటర్ వద్దగల శ్రీ కన్నమాంబ జాతర మహోత్సవం ఇన్నీసుపేటలో వనుము బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మార్గాని నరేష్, ఎస్పీ శ్రీనివాస్, నగర వైఎస్సార్ సీపీ యువజన విభాగ అధ్యక్షుడు పీతా రామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం


బదిలీ అయిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను సన్మానించిన నేతలు

సీతానగరం: మండలంలో ఇటీవల పదోన్నతి, బదిలీ అయిన 12 మంది ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. కాటవరం ఎంపీయూపీ స్కూల్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నేతలు పల్లా రాజారావు, కె.ప్రసాదచౌదరి, ఎం.రామకృష్ణ చేతుల మీదుగా సన్మానించారు. అనంతరం మండల పీఆర్‌టీయు కార్యదర్శిగా కె.దుర్గా శ్రీనివాస్‌ను నియమించారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్యసేవలు అందిస్తున్న న్యూరో సర్జన్ డాక్టర్ రాజేష్

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన హరిత న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం హరిత న్యూరో సెంటర్ న్యూరో ఫిజీషియన్, స్ట్రోక్ వైద్యనిపుణులు డాక్టర్ క్రొవ్విడి రాజేష్, డాక్టర్ సత్యం రమేష్‌బాబు రోగులకు వైద్య సేవలు అందించారు. పక్షవాతం, మతిమరుపు, మెదడు వాపు, వంటి పలు వ్యాధులకు సంబంధించి 117 మంది రోగులను పరీక్షించి, వైద్యసేవలు అందించారు. మందులను పంపిణీ చేశారు. సినీ దర్శకులు, నటుడు కాశీ విశ్వనాథ్ వైద్యశిబిరాన్ని సందర్శించారు. వి.రామరాజు, వెంకటలక్ష్మి, శేఖర్, కె.నరసింహారావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరిక


నేతలను పార్టీ కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజా

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం సీతానగరం జీవీకే కన్వెన్షన్ హాలులో నియోజకవర్గ పార్టీల చేరికల కమిటీ కన్వీనర్ గద్దె వెంకటకృష్ణ చౌదరి ప్రోద్బలంతో వంగలపూడికి చెందిన ముత్తిన శ్రీనివాస్, వేములపల్లి రాజు (పురుషోత్తపట్నం)లతోపాటుగా మరికొందరికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన వారు వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారన్నారు. గడిచిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంలో సఫలీకృతం అయ్యారన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, చల్లమళ్ళ సుజీరాజు, కొండు రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం


ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుంటున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీసూర్య ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ మిత్రులంతా ఒకచోటకు చేరి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని, స్వీట్లు తినిపించుకుని, శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీనివాస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ద్వారంపూడి యువరాజారెడ్డి, క్లబ్ ఆర్‌సీ పీఏసీఎస్ రెడ్డి, కోశాధికారి ద్వారంపూడి వీర్రాఘవరెడ్డి, మండ రాజారెడ్డి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, ఆర్ఏఆర్‌కె చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మధురపూడి: కోరుకొండ మండలం పెట్రోలు బంకు శివారునున్న దాబాలో రోజుకూలీగా పనిచేస్తున్న అంగడ రాంబాబు ఆదివారం రాత్రి ప్రమాదానికి గురయ్యాడు. చెత్తను రోడ్డుకు అవతల వైపున వేయడానికి వెళ్లగా అటుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో అతనికి బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108లో అతడిని హాస్పిటల్‌కు తరలించారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు, దేవరులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సొంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి ఆలయంలో ఆదివారం స్వామికి పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తుల కోసం అన్నదానం ఏర్పాటుచేశారు.

విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

బిక్కవోలు: మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఎంపీడీవో జేఏ ఝాన్సీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా పిల్లలందరి చేత మాత్రలు మింగించాలని సూచించారు.

బూరుగుపూడిలో పండ్ల పంపిణీ


బూరుగుపూడిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో జక్కంపూడి జయంతి నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులు, తదితరులకు పండ్లు పంపిణీ చేశారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు, సభ్యుడు కంటే వినయ్‌తేజ, వైఎస్సార్ సీపీ నాయకులు మేకా నెహ్రూరాజు, బుద్దిగ సత్తిబాబు, అడపా రామకృష్ణ పాల్గొన్నారు.